సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం ၊ 25 ၊ జూన్ ၊ 2025



బూడిద.. చెరువుల పాలు

పినపాక-మణుగూరు సరిహద్దులోని బీటీపీఎస్‌లో ఉత్పత్తి అవుతున్న బూడిద ధరలు పెంచడంతో కొనుగోళ్లు తగ్గుముఖం పట్టాయి. 8లో



.. రైళ్లను పునరుద్ధరించాలి

కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని డీఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాస రెడ్డి రైల్వే అధికారులను కోరారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 26°

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. ఆ తర్వాత స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

గిరిజన మ్యూజియం భేష్..

'మోటా' ప్రత్యేకాధికారి సుభాష్



కళాకాండాలను పరిశీలిస్తున్న సుభాష్ తదితరులు

భద్రాచలంటౌన్: ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలు అంతరించిపోకుండా నాటి గుర్తులతో నిర్మించి గిరిజన మ్యూజియం బాగుందని మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ - న్యూఢిల్లీ(మోటా) ప్రత్యేకాధికారి సుభాష్ అన్నారు. భద్రాచలం డివిజన్‌లో రెండు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన ఆయన మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని మ్యూజియాన్ని సందర్శించి కళాఖండాలు, పెయింటింగ్‌లు, గిరిజన వంటకాలను ఆస్వాదించారు. అనంతరం మాట్లాడుతూ.. పర్యాటకులకు కనువిందు కలిగేలా ట్రైబల్ మ్యూజియం రూపొందించడం హర్షణీయమని అన్నారు. జిల్లాలో రెండు రోజులు పర్యటించి దేవాలయాలతో పాటు మ్యూజియాన్ని సందర్శించడంతో మంచి అనుభూతి కలిగిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు గిరిజనులకు సక్రమంగా అందిస్తున్న ఐటీడీఏ అధికారులను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పీఓ బి.రాహుల్, ఏపీఓ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ తదితరులు ఉన్నారు.

సీఐపై సస్పెన్షన్ వేటు ?

ఇల్లెందు: ఇల్లెందు పోలీస్ సబ్ డివిజన్‌లోని ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఎన్‌ఆర్‌ఐ ఒకరు కేసు విషయమై సదరు సీఐతో ఇటీవల ఫోన్‌లో మాట్లాడగా దురుసుగా బదులిచ్చినట్లు సమాచారం. దీంతో సదరు ఎన్‌ఆర్‌ఐ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారని తెలిసింది. ఈమేరకు సీఐని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు మంగళవారం నిర్ణయం తీసుకున్నారని సమాచారం అందగా, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మరో ముందడుగు

రెండేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్న సీతమ్మ సాగర్ బరాజ్, కరకట్టల నిర్మాణం విషయంలో ఒక్కో అడుగు ముందుకు పడుతోంది. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌కు కీలకమైన టెక్నికల్ కమిటీ అనుమతులు గత ఏప్రిల్‌లో జారీ కాగా, ఇప్పుడు భూ నిర్వాసితులకు పరిహారం విషయంలోనూ ప్రభుత్వం నుంచి సానుకూల ప్రకటన వచ్చింది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

సీతమ్మసాగర్ కరకట్ట నిర్వాసితులకు పరిహారంలో కదలిక

- ఈ ప్రాజెక్టుతో ఎగువ ప్రాంతాల్లో ముంపు సమస్య
- వరద నివారణకు ఎత్తుగా కరకట్టల నిర్మాణం
- పరిహారం ఇవ్వాలంటూ కొంతకాలంగా ఆందోళనలు





అర్ధంతరంగా నిలిచిన సీతమ్మ సాగర్ పనులు (ఇన్‌సెట్) పనులు లేక ఖాళీగా ఉన్న టిప్పర్లు

100 అడుగుల ఎత్తుతో..

సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టగా దుమ్ముగూడెం, అశ్వాపురం మండలాల మధ్య గోదావరి నదిపై సీతమ్మసాగర్ పేరుతో బరాజ్ నిర్మాణ పనులు 2022 చివరలో ప్రారంభమయ్యాయి. ముందుగా నిర్ణయించిన ప్లాన్‌లో బరాజ్‌కు ఇరువైపులా కొద్ది దూరం మేరకే రివిట్‌మెంట్ నిర్మాణాలు ఉన్నాయి. అయితే అదే ఏడాది జూలైలో 29 లక్షలకు పైగా క్యూసెక్కుల వరద గోదావరికి రావడంతో నదీ తీర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. అంతేకాదు.. నదిలో కలిసే వాగుల్లోకి సైతం గోదావరి వరద ఎగపోటు వేసింది. ఈ భారీ వరద ఫలితాలను దృష్టిలో ఉంచుకుని సీతమ్మ సాగర్ బరాజ్‌కు ఎగువన ఇరువైపులా, నదిలో కలిసే వాగులకు సైతం కరకట్టలు నిర్మించాలని నిర్ణయించారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద కరకట్ట ఎత్తు 80 అడుగులుగా ఉంటే బరాజ్‌కి ఎగువన వంద అడుగుల ఎత్తుతో నిర్మించేలా డిజైన్ చేశారు.

భూసేకరణ సమస్య..

సీతమ్మ సాగర్‌కు ఎగువన ఒక వైపు అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాలు, మరోవైపు దుమ్ముగూడెం, చర్ల మండలాలు ఉన్నాయి. అశ్వాపురం వైపు 40 కి.మీ., దుమ్ముగూడెం వైపు 55 కి.మీ. కరకట్టల పనులు వెంటనే ప్రారంభించారు. ఈ కొత్త నిర్మాణాల కోసం స్థానిక రైతుల నుంచి భూములు సేకరించాల్సి వచ్చింది. ఇందులో కొన్ని పట్టా భూములు ఉండగా మరికొన్ని పట్టా లేనివి ఉన్నాయి. అయితే కరకట్ట పనులు చేపట్టడానికి ముందే తమకు పరిహారం చెల్లించాలంటూ రైతులు ఆందోళనకు దిగారు. ముఖ్యంగా చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో ఈ తరహా ఆందోళనలు ఎక్కువగా జరిగాయి. ఓ వైపు రైతుల ఆందోళనలు కొనసాగుతుండగా మరోవైపు నిర్మాణ పనులు మొదలయ్యాయి.

కోర్టు ఆదేశాలతో..

సీతారామ ప్రాజెక్టులో ప్రధానమైన సీతమ్మ సాగర్ బరాజ్, కరకట్ట నిర్మాణ పనులకు పర్యావరణ అనుమతులు తీసుకోలేదని, తమకు సరైన పరిహారం అందించలేదని కొందరు న్యాయస్థానం, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో 2023 మే చివరి వారంలో సీతమ్మ సాగర్ బరాజ్ పనులు ఎక్కడివక్కడే ఆపేయాలంటూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. దీంతో బరాజ్‌తో పాటు కరకట్ట పనులు సైతం నిలిచిపోయాయి. దీంతో రెండేళ్లుగా కరకట్ట పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థల వారు కొందరు యంత్రాలతో పాటు కార్మికులను ఇతర ప్రాంతాలకు తరలించారు. మరికొన్ని సంస్థలు భారీ యంత్రాలను నదీ తీరంలోనే నిలిపి ఉంచగా.. అవి తుప్పు పట్టే దశకు చేరుకున్నాయి. ఈ తరుణంలో ప్రభుత్వం నుంచి సీతమ్మసాగర్ విషయంలో సానుకూల నిర్ణయం వెలువడింది.

దశలవారీగా పరిహారం..

కరకట్టల నిర్మాణం కారణంగా నష్టపోయే రైతులను ప్రభుత్వం రెండేళ్ల క్రితం గుర్తించింది. అయితే వారికి పరిహారం మాత్రం అందలేదు. తాజాగా చర్ల మండలం దేవరపల్లి(జెడ్) గ్రామంలో 13.26 ఎకరాల స్థలానికి సంబంధించి పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దశలవారీగా పరిహారం చెల్లింపులు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. అంతకుముందే సీతమ్మ సాగర్ బరాజ్, సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)కు కేంద్రం నుంచి ఆమోదం తెచ్చే విషయంలోనూ ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించింది. గత ఏప్రిల్‌లో టెక్నికల్ కమిటీ నుంచి అనుమతులు వచ్చాయి. పర్యావరణ అనుమతులు రావడం ఇక లాంఛనమే అనే తరుణంలో భూ నిర్వాసితుల పరిహారం విషయంలోనూ కదలిక వచ్చింది.

గిరిజన సంస్కృతి | అందరికీ తెలిసేలా..

- ఆదివాసీ భాష, కట్టుబాట్లను పదిలపరుస్తున్న పీఓ
- స్వయం ఉపాధి, విద్యారంగంపై ప్రత్యేక దృష్టి
- రాహుల్ బాధ్యతలు చేపట్టి నేటికి ఏడాది



భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ పీఓగా రాహుల్ బాధ్యతలు స్వీకరించి బుధవారంతో ఏడాది పూర్తయింది. విద్య, వైద్య రంగాలకు ప్రాముఖ్యత ఇస్తూనే గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు అందరికీ తెలిసేలా ఆయన చేపట్టిన చర్యలు విజయవంతం అయ్యాయి. రాహుల్ ప్రత్యేక చొరవతో రూపుదిద్దిన గిరిజన మ్యూజియం పర్యాటక ప్రాంతంగా మారింది.

చదువును చక్కదిద్దుతూ..

ఏజెన్సీలో విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, గిరిజనాభివృద్ధికి కృషి చేస్తానని విధుల్లో చేరిన రోజే చెప్పారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పర్యటించి కొందరు విద్యార్థులు కనీస సామర్థ్యాల్లో వెనుకబడ్డారని గుర్తించారు. అలాంటి వారి కోసం 'ఉద్దీపనం' పేరిట 1 నుంచి 4వ తరగతుల వరకు గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో స్టడీ మెటీరియల్ రూపొందించారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థుల కోసం 'కెరీర్ గైడెన్స్ వాల్'ను ఏర్పాటు చేయించారు.

నిరుద్యోగులకు ప్రోత్సాహం..

నిరుద్యోగ యువత, గిరిజన మహిళల స్వయం ఉపాధికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. మిల్లెట్స్‌తో బిస్కెట్లు, సబ్బులు, షాంపూల తయారీ వంటి చిన్న తరహా పరిశ్రమల్లో వారిని భాగస్వాములను చేశారు. మార్కెటింగ్‌కు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. జాబ్‌మేళాలు నిర్వహించి ప్రైవేట్ సెక్టార్లలో ఉద్యోగాలు ఇప్పించారు. నిరుద్యోగులు చదువుకుని ఉద్యోగాలు సాధించేలా భద్రాచలంలోని లైబ్రరీని పంచాయతీ నిధులతో అభివృద్ధి చేయడంతో పాటు స్టడీ మెటీరియల్ ఏర్పాటు చేశారు. మెరిట్ ర్యాంకర్లకు ల్యాప్‌టాప్‌లు, ఆర్థిక సాయం అందిస్తున్నారు.

ఆదివాసీల వంటకాలు అందరికీ తెలిసేలా..

ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన మ్యూజియాన్ని ఆధునికీకరించడంతో పాటు ఆదివాసీ వంటకాల రుచులు అందరికీ తెలిసేలా స్టాళ్లు ఏర్పాటు చేసి మంత్రులు, ఉన్నతాధికారుల మెప్పు పొందారు. ఆదివాసీ ఉత్పత్తులను విశ్వవ్యాప్తం చేసేందుకు ఢిల్లీ భవన్‌లో సైతం ప్రదర్శనకు ఉంచారు. అంతేకాక ఆదివాసీ భాష తాను నేర్చుకుంటూ వారితో మమేకమయ్యేలా ప్రయత్నించారు. ప్రత్యేక కార్యక్రమాలకు కోయ భాషలో ఆహ్వానాలు అందిస్తూ గిరిజన సంస్కృతిని విశ్వవ్యాప్తం చేస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలందేలా..

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రణాళికలు రూపొందించారు. గోదావరి వరదల సమయంలో గర్భిణులను గుర్తించి ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ధరల పట్టిక రూపొందించి అధికంగా వసూలు చేయకుండా కట్టడి చేశారు. అయితే మూడు రాష్ట్రాల గిరిజనులకు కేంద్రంగా ఉన్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిపై మాత్రం తనదైన మార్క్ చూపించలేకపోయారనే ఆరోపణలు ఉన్నాయి.

రైతు భరోసాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

పాల్వంచరూరల్: వానాకాలంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా డబ్బులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విద్యాచందన పేర్కొన్నారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని రైతువేదికలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో నిర్వహించిన ముఖాముఖిలో అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఏడీఏ యు.నర్సింహారావు, ఎంపీడీఓ కె.విజయభాస్కర్ రెడ్డి, ఏఓ శంభోశంకర్, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఏపీఓ పొరండ్ల రంగా, ఏపీఎం రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు చెన్నకేశవ, ఏఈఓలు సత్యం, శాంతి, ఇతర శాఖల అధికారులు కె.వెంకటేశ్వర్లు, మాధవీలత, అశోక్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

దుమ్ముగూడెం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మారుమూల ప్రాంతాల ఆదివాసీలు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. నర్సాపురంలో మంగళవారం నిర్వహించిన ధర్తీ ఆబాజాన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ యోజన సదస్సులో వారు మాట్లాడారు. గిరిజనులు ఆయా సంక్షేమ పథకాలు పొందాలంటే వ్యక్తిగత గుర్తింపు కార్డులు అవసరమని, వివిధ రకాల గుర్తింపు కార్డులు అందించేందుకే ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ పేర్లు నమోదు చేసుకొని గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. ముఖ్యంగా ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, ఆయుష్మాన్ భారత్, పీఎం జన్మన్, కేవైసీ, రేషన్ కార్డులతో పాటు కుల ధ్రువీకరణ పత్రాలను గ్రామ సభల్లోనే పొందొచ్చని చెప్పారు. ఆహార నియమాలు పాటించకపోవడంతో ఎక్కువ మంది సికిల్‌సెల్ అనీమియా వ్యాధితో బాధ పడుతున్నారని, ఆయుష్మాన్ భవ కార్డు ద్వారా ఇలాంటి వ్యాధులకు రూ.5లక్షల విలువైన వైద్యం ఉచితంగా అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఏఓ సున్నం రాంబాబు, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ సమ్మయ్య, ఆర్‌ఐ వెంకటేశ్వర్లు, డాక్టర్ సుభాష్, ఏఓ నవీన్ కుమార్, ఐకేపీ ఏపీఎం హేమంతిని, ఏపీఓ సుకన్య తదితరులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం : గిరిజన మహిళకు కార్డు అందజేస్తున్న పీఓ రాహుల్, ఎమ్మెల్యే వెంకట్రావు తదితరులు

అందరికీ ఆదర్శంగా నిలవాలి

భద్రాచలంటౌన్ : ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించి అందరికీ ఆదర్శంగా నిలవాలని పీఓ రాహుల్ అన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలలో చదివి మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ స్పోర్ట్స్ కోచింగ్ కాలేజీలో సీటు సాధించిన దుమ్ముగూడెం మండలం లింగాపురం గ్రామానికి చెందిన కాక జోగారావుకు మంగళవారం ఆయన రూ. 47 వేల చెక్కు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మణిపూర్‌లో సీటు సాధించిన జోగారావుకు ఉన్నత చదువుల కోసం ఐటీడీఏ నుంచి ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ఎమ్మెస్సీ చదువుతూ స్పోర్ట్స్ కోచింగ్ తీసుకొని జాతీయస్థాయిలో ఎనిమిదో ర్యాంకు, రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచాడని అభినందించారు.

అర్హులందరికీ బియ్యం

- మూడు నెలలకు 16,773 మెట్రిక్ టన్నులు అవసరం
- రేషన్ షాపులకు చేరిన బియ్యం 16,258 మె.టన్నులు
- 2,41,760 కార్డులకు పూర్తయిన పంపిణీ
- కొన్నిచోట్ల కొనసాగుతున్న సరఫరా

గ్రౌండ్ రిపోర్ట్



కిన్నెరసానిలో బియ్యం ఇస్తున్న డీలర్

కొత్తగూడెంఅర్బన్: వర్షాకాలం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు మూడు నెలల సన్నబియ్యాని ఈనెల 1 నుంచి సరఫరా చేస్తోంది. ఈనెల 30 వరకు అర్హులందరికీ బియ్యం పంపిణీ చేసేలా చర్యలు చేపట్టింది. అయితే కొన్ని దుకాణాల్లో మూడు నెలల స్టాక్ నిల్వ చేసే పరిస్థితి లేకపోవడంతో బియ్యం అయిపోగానే మళ్లీ పంపించేలా ఏర్పాట్లు చేశారు.

81.34 శాతం పూర్తి..

జిల్లాలో 2,97,189 రేషన్‌కార్డులు ఉండగా ఇప్పటికే 2,41,760 కార్డులవారికి బియ్యం పంపిణీ చేశామని, 81.34 శాతం ప్రక్రియ పూర్తయిందని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి రుక్మిణి తెలిపారు. మూడు నెలల కోటా 16,773 మెట్రిక్ టన్నుల బియ్యానికి గాను ఇప్పటివరకు 16,258 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ షాపులకు చేరాయని, మరో 515 మెట్రిక్ టన్నుల బియ్యం ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి రావాల్సి ఉందని చెప్పారు. ఈనెలాఖరు లోగా అవికూడా పంపిణీ చేసేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. అయితే క్షేత్రస్థాయిలో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్నిచోట్ల బియ్యం స్టాక్ లేక లబ్ధిదారులు మరో దుకాణానికి వెళ్లాల్సి వస్తుండగా, ఇంకో చోట సరఫరాలో జాప్యం జరుగుతోంది.

బియ్యం లేక షాప్ మూత..



బియ్యం లేక మూసిఉన్న రేషన్ షాపు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ఒక రేషన్ షాపులో బియ్యం నిల్వలు లేక దుకాణాన్ని మూసివేశారు. మండలంలో మొత్తం 21 రేషన్ షాపులు ఉండగా మూడు నెలల రేషన్ ఒకేసారి ఇవ్వాలని నిర్ణయించడంతో అధికారులు పూర్తి స్థాయిలో బియ్యం నిల్వ ఉంచారు. కానీ, మెడికల్ కాలనీలోని 19వ నంబర్ షాపులో బియ్యం లేక డీలర్ షాపునకు తాళం వేశాడు. దీంతో లబ్ధిదారులు వేరే దుకాణానికి వెళ్లాల్సివచ్చింది. కాగా, మంగళవారం పట్టణంలో విద్యుత్ కోత ఉండడంతో బయోమెట్రిక్ మిషన్లు పనిచేయక చాలా రేషన్ షాపులను మూసివేశారు.

మిగిలింది 5 శాతమే..



బూర్గంపాడులోని జీసీసీ రేషన్ షాప్

బూర్గంపాడు: మండల కేంద్రంలో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేషన్ షాపులో 95 శాతం మేర బియ్యం పంపిణీ పూర్తయింది. ఈ షాపు పరిధిలో 482 రేషన్‌కార్డులుండగా 450 మంది ఇప్పటికే బియ్యం తీసుకున్నారు. సెలవు రోజుల్లో మినహా మిగతా సమయాల్లో సేల్స్‌మెన్ అందుబాటులో ఉంటూ బియ్యం పంపిణీ చేస్తున్నారు. మిగిలిన ఐదు శాతం కూడా బుధవారం పూర్తి చేస్తామని చెబుతున్నారు.

'పేట'లో 94 శాతం పూర్తి..



షాపు వద్ద వేలిముద్ర వేస్తున్న లబ్ధిదారుడు

అశ్వారావుపేట : అశ్వారావుపేటలో 94 శాతం మందికి రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తయింది. మున్సిపాలిటీ పరిధిలోని 2వ నంబర్ షాపులో 1,261 రేషన్ కార్డులు ఉండగా మూడు నెలలకు సంబంధించి 725.69 క్వింటాళ్ల బియ్యం వచ్చాయి. ఇందులో 683.55 క్వింటాళ్లు పంపిణీ చేయగా, 37.14 క్వింటాళ్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఎంఎల్‌ఎస్ పాయింట్ దమ్మపేటలోనే ఉండడంతో నిల్వలు అయిపోయే లోపే మళ్లీ బియ్యం వస్తున్నాయి.

జీసీసీ నుంచే ఆలస్యం



లక్ష్మీదేవిపల్లిలో బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

పాల్వంచరూరల్ : వర్షాకాలంలో పేదలు ఇబ్బంది పడకుండా మూడు నెలల బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినా.. క్షేత్రస్థాయిలో జాప్యంతో లబ్ధిదారులు ఇబ్బంది పడ్డాల్సి వస్తోంది. పాల్వంచ మండలంలోని కొన్నిషాపులకు జీసీసీ పాయింట్ నుంచి బియ్యం సరఫరా ఆలస్యమవుతోంది. మరికొన్ని చోట్ల వేలిముద్రలు పడక, మిషన్లకు సిగ్నల్ అందక డీలర్లు, లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. కిన్నెరసాని షాప్ పరిధిలో 556 రేషన్‌కార్డులకు గాను 308.18 క్వింటాళ్ల బియ్యం వచ్చా యి. ఇందులో ఇప్పటివరకు 251 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేయగా ఇంకా 57క్వింటాళ్లు మిగిలి ఉన్నా యి. లక్ష్మీదేవిపల్లి షాప్ పరిధిలో 962 రేషన్‌కార్డులు ఉండగా ఇంకా 150 మందికి బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. జీసీసీ పాయింట్ నుంచి బియ్యం సరఫరాలో జాప్యంతోనే మిగిలిన వారికి బియ్యం అందించలేదని డీలర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

మూడుసార్లు తిరిగినా బియ్యం ఇవ్వలే

మూడు నెలల బియ్యం ఇస్తున్నారంటే ఇప్పటికి మూడు సార్లు వచ్చినా ఇంకా ఇవ్వలేదు. జీసీసీ పాయింట్ నుంచి బియ్యం రాలేదని డీలర్ అంటున్నాడు. బియ్యం పంపిణీ గడువు పెంచి అందరికీ వచ్చేలా చూడాలి.– తేనె వెంకటేశ్వర్లు, లబ్ధిదారుడు

నిల్వ సామర్థ్యం లేక ఇక్కట్లు

ఇల్లెందు: ఇల్లెందులోని 13వ నంబర్ బస్తీ 16వ వార్డులో రెండు గదుల రేకుల షెడ్డులో రేషన్ షాప్ నిర్వహిస్తున్నారు. ఇందులో ఒక నెలకు సరిపడ బియ్యం కూడా నిల్వచేసే పరిస్థితిలేదు. దీంతో మూడు నెలల స్టాక్‌ను ఐదు దఫాలుగా అందజేశారు. ఈ షాపు పరిధిలో 730 రేషన్ కార్డులు ఉండగా ఇప్పటికి 630 మందికి బియ్యం పంపిణీ చేశారు. కొందరు వృద్ధులకు వేలిముద్రలు పడకపోవడంతో ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని రేషన్ అందజేస్తున్నారు. కాగా, తమకు మూడు నెలలుగా కమీషన్ ఇవ్వడం లేదని డీలర్లు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రతీ నెల కమిషన్ ఇవ్వాలని కోరుతున్నారు.



వేలిముద్ర వేస్తున్న లబ్ధిదారురాలు

ఆగస్టు 15 నాటికి దరఖాస్తుల పరిష్కారం

భూ భారతిపై వీసీలో కలెక్టర్ పాటిల్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా 58,365 దరఖాస్తులు వచ్చాయని, ఆగస్టు 15 వరకు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా నుంచి కలెక్టర్ హాజరై మాట్లాడారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి నోటీసులు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టామని, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వన మహోత్సవంలో 70 లక్షల మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలను కూడా భాగస్వామ్యం చేసేలా విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని వివరించారు. సమావేశంలో జిల్లా అటవీశాఖాధికారి కృష్ణగౌడ్, ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, డీఏఓ బాబూరావు, డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, జిల్లా ఉద్యాన శాఖాధికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు

కొత్తగూడెంటౌన్: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం మాదకద్రవ్య నివారణ వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని సూచించారు. డ్రగ్ నిర్మూలన సోల్జర్‌గా నమోదు చేసుకునేందుకు లింక్ ఏర్పాటు చేశామని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై పోలీస్ శాఖ తరఫున అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినట్లు తెలిసినా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, సీఐ శ్రీనివాస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐ కరుణాకర్, ఐటీ సెల్ రాము, జూలూరుపాడు, అశ్వారావుపేట సీఐలు ఇంద్రసేనారెడ్డి, నాగరాజురెడ్డి, ఆర్‌ఐలు నర్సింహారావు, కృష్ణారావు పాల్గొన్నారు.

నిరుపయోగ వస్తువులకు రేపు వేలం

జిల్లా పోలీసు శాఖలో నిరుపయోగ వస్తువులను ఈ నెల 26న వేలం వేస్తామని ఎస్పీ రోహిత్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో వేలం ఉంటుందని, కంప్యూటర్, మానిటర్లు, సీపీయూలు, కీ బోర్డులు, మౌస్‌లు, యూపీఎస్‌లు, ట్యాబ్‌లు, యాపిల్ ఐపాడ్‌లు, ఇన్వెర్టర్, ఇన్వర్టర్ బ్యాటరీలు, డ్రాగన్ లైట్లు, టెంట్‌లు, టేబుళ్లు, కుర్చీలు, బీరువా తదితర వస్తువులను వేలం వేస్తామని వివరించారు. పాల్గొనేవారు జిరాక్స్, ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకురావాలని, వివరాలకు 87126 82143 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్ బదిలీ

● వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్‌గా నియామకం


రవికుమార్

వైరా: ఖమ్మం జిల్లా వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ బదిలీ అయ్యారు. ఆయనను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్‌గా నియమించారు. అయితే, రవికుమార్ స్థానంలో కేవీకే కోఆర్డినేటర్‌గా ఎవరినీ నియమించలేదు. కేవీకేలో సీనియర్ శాస్త్రవేత్తకు కోఆర్డినేటర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం.

ఉద్దీపనం పుస్తకాల సరఫరాకు టెండర్లు

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ గిరిజన ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలల్లో ఒకటి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు ఉద్దీపకం వర్క్ బుక్–2 ఇవ్వనుండగా, ముద్రించి సరఫరా చేసేందుకుటెండర్లు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. సుమారు 13,206 మంది విద్యార్థులకు అన్నిపుస్తకాలు కలిపి 30,89,784 పేజీల మేర ముద్రించి సరఫరా చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న ఉమ్మడి జిల్లాలోని ప్రింటింగ్‌ప్రెస్‌ల యజమానులు నిర్ణీత రుసుం డీడీ రూపంలో చెల్లించి ఐటీడీఏ కార్యాలయంలో టెండర్ దరఖాస్తులు తీసుకుని ఈ నెల 28వ తేదీ వరకు సమర్పించాలని సూచించారు. వివరాలకు ఐటీడీఏ ఉపసంచాలకుల కార్యాలయంలో 97013 15526, 91828 61609 నంబర్ల ద్వారా సంప్రదించాలని పీఓ ప్రకటనలో తెలిపారు.

మావోయిస్టులకు సహకరించొద్దు..


ఆదివాసీలతో మాట్లాడుతున్న ఏఎస్పీ నరేందర్

పాల్వంచరూరల్: సంఘ విద్రోహ శక్తులు, మావోయిస్టులకు ఆదివాసీ గిరిజనులు సహకరించవద్దని జిల్లా అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) జి.నరేందర్ సూచించారు. మండలంలోని మల్లారం జీపీ మామిడికుంట గ్రామాన్ని మంగళవారం సీఐ సతీశ్‌కుమార్‌తో కలిసి అడిషనల్ ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆదివాసీలతో మాట్లాడారు. పిల్లలకు స్టడీ మెటీరియల్, పుస్తకాలు పంపిణీ చేశారు. వలస ఆదివాసీలకు పోలీసుల సహకారం ఎప్పుడూ ఉంటుందని, మావోయిస్టులకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలపాలని చెప్పారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ సురేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా అథ్లెట్‌కు అభినందన


శ్రీతేజను అభినందిస్తున్న మహీధర్

కొత్తగూడెంటౌన్: కరకగూడెంనకు చెందిన అథ్లెట్ తోలెం శ్రీతేజకు బంగారు పతకం రావడం హర్షణీయమని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.మహీధర్ మంగళవారం తెలిపారు. యూపీలోని ప్రయోగరాజ్‌లో జరుగుతున్న జాతీయ జూనియర్ (అండర్–20) ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తోలెం శ్రీతేజ.. ఈవెంట్లో బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. శ్రీతేజ, కోచ్ నాగేందర్‌బాబును యువజన క్రీడలశాఖ అధికారి ఎ. పరందామరెడ్డి, అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.సారంగపాణి, కోచ్ నాగపూరి రమేశ్ తదితరులు అభినందించారని ఆయన పేర్కొన్నారు.

వైన్స్ వద్ద ఘర్షణ.. కత్తిపోట్లు

ఖమ్మంఅర్బన్: వైన్స్ వద్ద మందుబాబుల మధ్య జరిగిన ఘర్షణ కత్తిపోట్లకు దారి తీసింది. ఖమ్మం విజయ డెయిరీ ఎదురుగా వైన్స్ వద్ద మంగళవారం రాత్రి ఈ ఘర్షణ చోటుచేసుకుంది. ఇందిరానగర్‌కు చెందిన మనీశ్ వైన్స్ వద్ద మద్యం సేవిస్తూ పలువురితో అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలిసింది. దీంతో టేకులపల్లి లక్ష్మీనగర్‌కు చెందిన తాపీ మేస్త్రీ మేదరాజుల వెంకటేశ్వర్లు ఇదేమిటని ప్రశ్నించగా వాగ్వాదం తలెత్తినట్లు సమాచారం. ఈక్రమంలోనే మనీష్‌కు ఆయన స్నేహితులు తోడై వెంకటేశ్వర్లుపై దాడి చేసినట్లు సమాచారం. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి కత్తి తీసుకొచ్చి మనీష్‌పై దాడి చేయగా ఆయన మెడపై తీవ్ర గాయం కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఆతర్వాత వెంకటేశ్వర్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం. కాగా, ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు వెల్లడించగా, ఈ గొడవతో ఆ ప్రాంతంలో వాహనదారులు ఆందోళనకు గురయ్యారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,748

బూడిద.. చెరువుల పాలు..

● యాష్ రేటు పెంచడంతో తగ్గిన కొనుగోళ్లు
● విధిలేక బూడిదను చెరువులకు వదులుతున్న అధికారులు
● అవి నిండుతుండడంతో కట్టల ఎత్తు పెంచుతున్న వైనం..


నిండిన పవర్ ప్లాంట్ బూడిద చెరువు

పినపాక: పినపాక – మణుగూరు మండల సరిహద్దులోని భద్రాద్రి పవర్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అవుతున్న బూడిద రేట్లను పెంచడంతో కొనుగోళ్లు తగ్గుముఖం పట్టాయి. దీంతో ఆ బూడిదను చెరువుల్లోకి తరలిస్తున్నారు. ఫలితంగా ఐదు నుంచి 10 అడుగుల వరకు ఉండాల్సిన బూడిద చెరువులను 30నుంచి 40అడుగుల ఎత్తువరకు పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. అదికూడా నిండితే అధికారులు ఏం చేస్తారోనని పరిసర ప్రాంత ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా, ఈ బూడిదను ఇటుకల బట్టీలు, సిమెంట్ కంపెనీలు, కన్‌స్ట్రక్షన్లలో వినియోగిస్తారు.

పెరుగుతున్న ధరలు

అధికారులు, కాంట్రాక్టర్లతో కలిసి బూడిద రేట్లను భారీగా పెంచుతున్నారు. పాల్వంచ కేటీపీఎస్‌లో టన్ను ధర రూ.30 నుంచి రూ.60 ఉండగా, టీబీపీఎస్‌లో రూ.150 నుంచి 200వరకు విక్రయిస్తున్నారు. ఇది కాక లోడింగ్ చార్జీలు, కాటా చార్జీల ఆధారంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. తద్వారా విక్రయాలు తగ్గి బూడిదను చెరువులకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

నిండిన చెరువులు

పవర్ ప్లాంట్ నుంచి వెలువడే బూడిద ఎక్కువ శాతం బంకర్ల ద్వారా ఇటుకల బట్టీలకు, సిమెంట్ కంపెనీలకు విక్రయించి, కొంత శాతం బూడిదను వాటర్ ద్వారా బూడిద చెరువుకు తరలిస్తారు. కానీ పవర్ ప్లాంట్‌లో దానికి భిన్న పరిస్థితి ఉంది. అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి అధిక రేట్లకు టెండర్లు వేసి బూడిద విక్రయిస్తున్నారు. రేట్లు అధికంగా ఉండడంతో సిమెంట్ కంపెనీలు, ఇటుకల బట్టీల యజమానులు మరోచోట బూడిదను కొనుగోలు చేస్తుండటంతో.. మిగులుతున్న బూడిదను గొట్టాల ద్వారా చెరువులకు తరలిస్తున్నారు. తద్వారా బూడిద చెరువులు నిండుతున్నాయి. ఇలా ఐదునుంచి పదిఅడుగులు ఉండాల్సిన బూడిదచెరువులు బూడిదతో నిండటం, వేరే ఒకమార్గం లేక సుమారు 30 నుంచి 40 అడుగులఎత్తుకు చెరువులను పెంచుతున్నారు. అది నిడితే అధికారులు ఏంచేస్తారన్న ప్రశ్న తలెత్తుతోంది.

ఉచితంగా ఇవ్వాలి

పవర్ ప్లాంట్ నిర్వాసిత గ్రామాల్లో ఉంటున్న ప్రజలకు, ఇటుకల బట్టీలకు, అవసరమైన వారికి ఉచితంగా బూడిద అందజేయాలి. అధిక రేట్లకు కొనలేని పరిస్థితి ఉంది. అధికారులు బూడిదను కూడా విక్రయిస్తుండడం సరికాదు. ఈ అంశంపై ఇప్పటికైనా పునరాలోచించాలి.

–సుబ్బారెడ్డి, ఇటుకల బట్టీ యజమాని, బిలాపురం

ధరలు తగ్గించాలి

బీటీపీఎస్‌లో బూడిద ధరలను తగ్గించాలి. నామమాత్రపు ధరలకు బూడిదను విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలి. టన్నుకు రూ.180 నుంచి రూ.200 పెట్టుకుని బూడిద కొంటే ఇటుకలు అధిక రేట్లకు అమ్మాల్సిన పరిస్థితి ఉంటుంది. అధికారుల తగు చర్యలు తీసుకోవాలి.

–రవి, బట్టుపల్లి

‘సీతారామ’ జలాలు ఇవ్వకపోతే సహించం..

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు


మాట్లాడుతున్న రేగా కాంతారావు

మణుగూరురూరల్: సీతారామ జలాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకు ఇవ్వకుండా అన్యాయం చేయాలని చూస్తే సహించబోమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల రైతాంగానికి సంబంధించి పదిలక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టి 90 శాతం నిధులతో పనులను పూర్తి చేసిందన్నారు. రాష్ట్రంలో మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఉమ్మడి జిల్లా మంత్రులు పూసగూడెం వద్ద ప్రాజెక్టును ప్రారంభించి ఈ జిల్లాకు నీరు ఇవ్వకుండా ఖమ్మం జిల్లాకు తరలించుకుపోవడం దుర్మార్గమని, ప్రజా ప్రభుత్వం, రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ మంత్రులు.. నేడు జిల్లా రైతాంగాన్ని విస్మరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ నెల 30వ తేదీన జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ నేతృత్వంలో పూసగూడెం నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్, పోశం నర్సింహరావు, వేర్పుల సురేశ్, అక్కి నర్సింహారావు, యాదగిరిగౌడ్, రామకోటి, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో పదోన్నతులు, బదిలీలు

అశ్వారావుపేట కమిషనర్‌గా నాగరాజు


ఎమ్మెల్యే జారెతో కమిషనర్ నాగరాజు

అశ్వారావుపేట/ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పలువురు ఉద్యోగులను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఖమ్మం నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లాను జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. అలాగే, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ జె.అనిల్‌కుమార్‌కు పదోన్నతి కల్పించి కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు.అంతేకాకుండా మధిర, వైరా కమిషనర్లుగావిధులు నిర్వర్తిస్తున్న ఏ.సంపత్‌కుమార్, సీహెచ్.వేణును అక్కడే పూర్తిస్థాయి కమిషనర్లుగా పోస్టింగ్ ఇచ్చా రు. అంతేకాక పలు మున్సిపాలిటీల్లో జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇచ్చారు. కొత్తగూడెంలో పనిచేస్తున్న జె.సుజితకు కేఎంసీలో సీనియర్ అసిస్టెంట్‌గా, ఇల్లెందులో పనిచేస్తున్న బి.సుధీర్‌కు వైరాలో, కేఎంసీలో పనిచేస్తున్న డి.నాగరాజుకు కొత్తగూడెం కార్పొరేషన్‌లో, సత్తుపల్లిలో పనిచేస్తున్న బి.రామచంద్రుకు కేఎంసీలో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. అలాగే, ఇల్లెందులో పనిచేస్తున్న ఎం.వీరకుమారి, మధిరలో పని చేస్తున్న ఆర్.నాగలక్ష్మి, కొత్తగూడెంలో పనిచేస్తున్న మూడ్ అశోక్, పి.సరస్వతికి పాత కేంద్రాల్లోనే పోస్టింగ్ ఇవ్వగా, మహబూబాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న కే.పీ.దిలీప్‌కుమార్‌ను సత్తుపల్లి సీనియర్ అసిస్టెంట్‌గా నియమించారు.

విధుల్లో చేరిన అశ్వారావుపేట కమిషనర్

గ్రేడ్–3 కమిషనర్‌గా పదోన్నతి పొందిన బి.నాగరాజును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట కమిషనర్‌గా నియమించారు. దీంతో ఇన్నాళ్లు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వ్యవహరించిన సుజాత నుంచి బాధ్యతలు స్వీకరించిన నాగరాజు ఆతర్వాత ఎమ్మెల్యే జారె ఆదినారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో కొత్త కమిషనర్‌ను ఎమ్మెల్యే సన్మానించి మున్సిపాలిటీలో అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళికపై సూచనలు చేశారు.

సింగరేణి ఇనుప సామగ్రి స్వాధీనం..!


స్వాధీనం చేసుకున్న సామగ్రి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో చోరీ చేసి తీసుకెళ్తున్న సింగరేణి ఇనుప వస్తువులను సెక్యూరిటీ సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. మణుగూరు ఓసీ నుంచి ఇనుప వస్తువులను ఆటోలో ముగ్గురు వ్యక్తులు తరలించుకుపోతుండగా, పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కాగా, ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా, దానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. అయితే మణుగూరు ఓసీలో అర్ధరాత్రి పెద్ద ఎత్తున కేబుల్ వైరు చోరీకి గురవ్వగా, ఉదయం ఘటనా స్థలానికి వెళ్తూ ఇనుప సామగ్రి మాత్రమే పట్టుకున్నారన్నప్రచారం పట్టణంలో జోరుగా సాగుతోంది.

జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకటేశ్వరాచారి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు నాయకులు రాయితీ కోసం వినతిపత్రం అందజేయగా, స్పందించి వెంటనే 50 శాతం ఫీజు రాయితీని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్లోజి శ్రీనివాస్, ఎండీ షఫీ, టెంజు జిల్లా అధ్యక్షులు వట్టికొండ రవి, నేషనల్ కౌన్సిల్ సభ్యులు చంద్ర నరసింహారావు, జర్నలిస్టులు కృష్ణగోవింద్, ప్రభాకర్‌రెడ్డి, రాజ్‌కుమార్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

వరి నాట్లు వేసిన ఎమ్మెల్యే


నాచారంలో వరి నాట్లు వేస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: మండలంలో పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నాచారం గ్రామంలో వరి నాట్లు వేస్తున్న మహిళలతో కలిసి నాట్లు వేశారు. మంగళవారం మండలంలోని లింగాలపల్లి, జమేదారుబంజర, గుర్వాయిగూడెం, పార్కలగండి, అంకంపాలెం, అర్లపెంట, కొడిసెలగూడెం, చెన్నువారిగూడెం, జగ్గారం, నాగుపల్లి, నాచారం, తొట్టిపంపు, మొద్దులగూడెం, అల్లిపల్లి, మల్కారం, పెద్దగొల్లగూడెం, దమ్మపేట గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. రూ.3,44,50,000 వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, పాఠశాల ప్రహరీలు, తాగునీటి బోర్లు, పైపులైన్లను ప్రారంభించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. నాచారంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి, వైద్య సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. దమ్మపేటలో ఉపాధి హామీ కూలీలకు గడ్డపారలు, బాల్చాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, ఎంపీడీఓ చంద్రశేఖరరెడ్డి, ఎంపీఓ రామారావు, ఏఈలు, డీఈలు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న డీఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కొత్తగూడెంఅర్బన్: సికింద్రాబాద్‌లోని రైల్వే భవన్‌లో మంగళవారం జరిగిన సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు డీఆర్‌యూసీసీ సమావేశంలో కొత్తగూడెం నుంచి డీఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్‌ఎం బర్తేశ్‌కుమార్ జైనికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సమావేశంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. కరోనా సమయంలో రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. మణుగూరు నుంచి కొత్తగూడెం మీదుగా తిరుపతి, షిరిడీకి ప్రత్యేక రైలు నడపాలని, సింగరేణి, కాకతీయ రైళ్లను పాత పద్ధతిలో అదనంగా భోగీలు ఏర్పాటు చేసి నడిపించాలన్నారు. రైల్వే అధికారులు మాట్లాడుతూ.. త్వరలోనే మణుగూరు టు కొత్తగూడెం మీదుగా తిరుపతి, షిరిడీకి ప్రత్యేక రైలు ఏర్పాటు చేస్తామని, రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయిస్తామని వివరించారు. సమావేశంలో సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్ ఏడీఆర్ఎం డాక్టర్ ఆర్.గోపాలకృష్ణన్, సీనియర్ డీసీఎం సిపాలికుమార్, సీనియర్ డీఓఎం డాక్టర్ సురేశ్‌రెడ్డి, డీసీఎం బి.చరణ్‌నాయక్, గూడ్స్ డీసీఎం విశాల్ అర్జున్, డీఆర్‌యూసీసీ సభ్యులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ


తండ్రి అంతిమయాత్రలో కుమార్తె సిరికొండ రాధిక

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ఫ్యూన్ బస్తీ(సింగరేణి ప్రధాన కార్యాలయం వెనుక ప్రాంతం)లోని సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మార్క బ్రహ్మయ్య(75) మంగళవారం మృతిచెందారు. ఆయనకు ఇద్దరూ కుమార్తెలే. వీరిలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న పెద్ద కుమార్తె సిరికొండ రాధిక తండ్రికి అంత్యక్రియలు నిర్వహించి తండ్రి రుణం తీర్చుకుంది. కాగా, బ్రహ్మయ్యకు కొడుకులు లేని లోటును కుమార్తెలే తీర్చారని స్థానికులు చర్చించుకున్నారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

పాల్వంచరూరల్: ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలంలోని మందెరకలపాడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాటి అయోధ్య హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడు. గతేడాది పూసలతండాకు చెందిన బి.సంధ్యను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఇటీవల సంధ్య భర్త, కుటుంబ సభ్యుతో గొడవపడి పుట్టింటికి వెళ్లింది. సోమవారం సంధ్య ఇంటికి వెళ్లి.. గొడవపడి మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని, సంధ్య తల్లి, కుటుంబ సభ్యులు మంజుల, ఆమె భర్త కుమార్ కారణమని మంగళవారం మృతుడి తండ్రి వీరభద్రం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యాన రక్తదానం


సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 70వ వ్యవస్థాపక వేడుకల్లో భాగంగా మంగళవారం ఖమ్మం మమత కాలేజ్ రోడ్డు బ్రాంచ్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 123 మంది ఎస్‌బీఐ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన బ్యాంక్ రీజినల్ మేనేజర్ బి.రాజేఖర్ మాట్లాడుతూ ప్రమాదకర పరిస్థితిలో ఉన్న వారిని ఆదుకోవడంలో రక్తదానం కీలకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం మోహన్‌నాయక్, బ్యాంక్ ఆఫీసర్ల అసోసియేషన్ ఏజీఎస్ షేక్ ఇబ్రహీం, రీజినల్ సెక్రటరీ ఆర్.శివకుమార్, హెచ్‌ఆర్ మేనేజర్ ఉదయ్, స్టాఫ్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ నందన్, రీజనల్ సెక్రటరీ చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాలో యువతులు

ఖమ్మం కొత్త బస్టాండ్‌లో పట్టుబడిన నిందితులు


నిందితులు, గంజాయితో ఎక్సైజ్ పోలీసులు

ఖమ్మంక్రైం: పోలీసులు, ప్రయాణికులకు అనుమానం రాకుండా అమ్మాయిలతో కొందరు అక్రమార్కులు గంజాయి రవాణా చేయిస్తున్నట్లు తేలింది. గంజాయి రవాణా సమాచారంతో ఎక్సైజ్ ఏఈఎస్ తిరుపతి ఆధ్వర్యాన మంగళవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఒక యువకుడు, ఇద్దరు యువతులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి బ్యాగుల్లో పరిశీలించగా రూ.2.50 లక్షల విలువైన గంజాయి బయటపడింది. ఒడిశా నుంచి గంజాయితో బయలుదేరిన వారు బస్సులు మారుకుంటూ ఖమ్మం చేరుకుని, బెంగళూరుకు వెళ్లడానికి సిద్ధమైనట్లు గుర్తించారు. నిందితులు ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన శుభకర్‌మండల్, కాజల్‌మండల్, శుశిశీలగా గుర్తించామని, వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎక్సైజ్ పోలీసులు వెల్లడించారు. తనిఖీల్లో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ శ్రీహరిరావుతో పాటు ఉద్యోగులు కరీం, హరీశ్, వెంకట్, సుధీర్, విజయ్‌కుమార్, ఉపేందర్, వీరబాబు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఐదుగురు అరెస్ట్

పాల్వంచ: గంజాయి సేవిస్తున్న ఐదుగురిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పాత పాల్వంచ చింతలచెర్వు కట్టపైన గంజాయి తాగుతున్న గాంధీనగర్ ఏరియాకు చెందిన సయ్యద్ సాజిద్‌పాషా, షేక్ సమీర్, షేక్ వసీంలతో పాటు మరో ఇద్దరు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 1.750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: చెల్లని చెక్కు కేసులో ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురానికి చెందిన మహ్మద్ జానీమియాకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి బిందుప్రియ మంగళవారం తీర్పు చెప్పారు. ముదిగొండ మండలం పెద్దమండవకు తాళ్లూరి శీతయ్య వద్ద జానీమియా 2018 ఆగస్టులో రూ.2లక్షల అప్పు తీసుకున్నాడు. తిరిగి చెల్లించే క్రమాన చెక్కు జారీ చేయగా అది బౌన్స్ అయింది. శీతయ్య కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. విచారణ అనంతరం జానీమియాకు ఆరు నెలల జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ.2.24లక్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు.